సామూహిక కుంకుమార్చన

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయంలో విజయ దశమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అమ్మవారు ధనలక్ష్మిగా సోమవారం దర్శనమిచ్చారు. మహిళలు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమార్చన చేశారు. చిత్రకూట మండపంలో రామాయణ పారాయణం హోమం సాగింది. రాములవారిని సినీ నటి అనసూయ దర్శించుకున్నారు. వైదిక పెద్దలు ఆశీర్వచనం అందించారు.

చదువుతోనే జీవితాల్లో మార్పు: ఎస్పీ

చర్ల, న్యూస్‌టుడే: సమాజ సేవలో పోలీసుశాఖ పాలుపంచుకుంటోందని ఎస్పీ రోహిత్‌రాజు అన్నారు. సుమారు రూ.2.50లక్షలతో బూరుగుపాడులో నిర్మించిన పాఠశాల భవనాన్ని ఓఎస్డీ సాయిమనోహర్‌తో కలిసి సోమవారం ప్రారంభించారు. శాంతి భద్రతలను కాపాడుతూనే సామాజిక సేవలనూ బాధ్యతగా భావించి అడుగులు వేస్తున్నామన్నారు. చదువుతోనే జీవితాల్లో మార్పు వస్తుందని తెలిపారు. తెలంగాణ సరిహద్దు చెన్నాపురంలో ఆదివాసీలకు ఆధునిక వైద్యసేవలందాలనే సంకల్పంతో రూ.కోటితో ఆసుపత్రిని నిర్మిస్తున్నామని గుర్తుచేశారు. ప్రధానోపాధ్యాయుడు సవలం వీరస్వామి, సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లొంగిపోయిన మావోయిస్టులకు చెక్కుల పంపిణీ.. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టులకు చర్ల ఠాణాలో జరిగిన కార్యక్రమంలో చెక్కులను ఎస్పీ రోహిత్‌రాజు పంపిణీ చేశారు. మడవి సోమమ్మ అలియాస్ గంగి, మడకం లింగా అలియాస్ రాకేశ్, మడవి భద్రయ్య అలియాస్ భద్రకు రూ.4లక్షల చొప్పున, కట్టం పొజ్జయ్యకు రూ.40వేలు, కల్మ బుద్రకు రూ.20వేల చెక్కులను అందజేశారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపిచ్చారు. ఓఎస్డీ సాయిమనోహర్, సీఐలు శ్రీనివాస్, రాజువర్మ, సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, ఎస్సై నర్సిరెడ్డి పాల్గొన్నారు.



బూరుగుపాడు పాఠశాలలో చిన్నారులతో ఎస్పీ రోహిత్‌రాజు, ఓఎస్డీ సాయిమనోహర్, సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డి

ట్రామా.. ఏర్పాటైతేనే ధీమా!



ట్రామా కేర్ కేంద్రాల్లో ఉండే సౌకర్యాలివే..

- క్షతగాత్రులకు అత్యవసరంగా సిటీస్కాన్ చేస్తారు.
- తీవ్రంగా గాయపడినవారికి ఎంఆర్ఐ స్కాన్ తీస్తారు.
- ఎముకలు విరిగిన వారికి అవసరమైన సామగ్రి సమకూర్చుతారు.
- ఆరోగ్యం విషమంగా ఉన్న వారి కోసం పది పడకలతో ఐసీయూ ఏర్పాటు చేస్తారు.

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం, న్యూస్‌టుడే, ఖమ్మం వైద్యవిభాగం: రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు మొదటి గంట(గోల్డెన్ అవర్)లో వైద్యమందిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించవచ్చునని వైద్యనిపుణులు చెబుతున్నారు. ఇందుకోసం ట్రామాకేర్ కేంద్రాలు దోహదపడతాయని పేర్కొంటున్నారు. వీటి ప్రాముఖ్యాన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రాష్ట్ర వ్యాప్తంగా ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుడుతోంది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలోనే కొత్తగూడెం సర్వజనాసుపత్రిలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించినా ఇప్పటికీ కార్యరూపం దాల్చకపోవటం గమనార్హం.

నెత్తురోడుతున్న జాతీయ రహదారులు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులపై నిత్యం చోటుచేసుకునే ప్రమాదాల్లో పలువురు చనిపోతున్నారు. అధిక మంది గాయాలపాలవుతున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర వైద్యసేవలందించేందుకు ప్రధాన రహదారుల వెంటనున్న ప్రాంతీయ, కమ్యూనిటీ ఆసుపత్రుల్లో ట్రామాకేర్ కేంద్రాలు ఏర్పాటుచేయాలని కొన్నేళ్లుగా ప్రతిపాదనలు పంపిస్తున్నా.. అటువైపుగా అడుగులు పడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ట్రామాకేర్ కేంద్రాల ఏర్పాటును మళ్లీ తెరపైకి తెచ్చింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఏర్పాటు చేయనుంది.

	ప్రమాదాలు	మరణాలు
ఖమ్మం (జనవరి నుంచి సెప్టెంబరు)	444	161
భద్రాద్రి (జనవరి నుంచి ఆగస్టు)	330	159


స్థల సేకరణ ప్రక్రియ పూర్తి

ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న కూసుమంచి మండలం గట్టుసింగారంలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని సేకరించినట్లు అధికారులు తెలిపారు. ప్రజాప్రతినిధుల చొరవతో త్వరలోనే 100 పడకలతో ట్రామాకేర్ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొస్తామంటున్నారు. ఖమ్మం జిల్లా మీదుగా వెళ్తున్న ఖమ్మం-కోదాడ, కరీంనగర్-రాజమహేంద్రవరం, కోదాడ-కురవి వంటి జాతీయ రహదారులపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన వారికి మొదటి గంటలో అత్యవసర వైద్యం అందుబాటులోకి వస్తుందని చెబుతున్నారు.

పాలకులు పట్టించుకుంటేనే..

విజయవాడ-జగదల్‌పూర్, కొత్తగూడెం-హైదరాబాద్ జాతీయ రహదారులు భద్రాద్రి జిల్లా కేంద్రం మీదుగా వెళ్తున్నాయి. జాతీయ రహదారులపై జరుగుతున్న ప్రమాదాలను గుర్తించిన గత ప్రభుత్వం అత్యవసర వైద్యం కోసం 'టెరి'(తెలంగాణ ఎమర్జెన్సీ రెస్పాన్స్ ఇనిషియేషన్) పేరిట ట్రామాకేర్ వైద్యసేవలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కొత్తగూడెం సర్వజనాసుపత్రిలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుచేయాలని నిర్ణయించినా కార్యరూపం దాల్చలేదు. ఇప్పటికైనా పాలకులు పట్టించుకుంటే ట్రామాకేర్ కేంద్రం భద్రాద్రి జిల్లావాసులకు అందుబాటులోకి వస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కూసుమంచి మండలం గట్టుసింగారంలో ట్రామాకేర్ కేంద్రం ఏర్పాటుకు స్థలం సేకరించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరవగానే టెండర్ ప్రక్రియ చేపడతాం. ఈకేంద్రం వల్ల క్షతగాత్రులకు అత్యవసర వైద్యం అందుబాటులోకి వస్తుంది.



- డా.రాజశేఖర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారి, ఖమ్మం

ఇప్పుడు దళారులకే మద్దతు!

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పెసల కొనుగోలు కేంద్రాల్లో దళారుల బెడద ఎక్కువవటంతో రెండు రోజులుగా క్రయవిక్రయాలకు అంతరాయం ఏర్పడింది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో డీసీఎంఎస్ ద్వారా ఖమ్మం, వైరాలో కొనుగోలు కేంద్రాలను ఆగస్టు 27న ప్రారంభించిన విషయం విదితమే. చాలామంది రైతులు తొలినాళ్లలోనే సరకును కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పొందారు. క్రమేణా ఈకేంద్రాల్లోకి దళారుల చొరబాటు ఎక్కువైంది. ఇప్పుడు రైతుల కంటే దళారులే అధికంగా సరకు తీసుకొస్తున్నారని విజిలెన్స్ అధికారులు గుర్తించటం గమనార్హం.



ఖమ్మంలోని పెసల కొనుగోలు కేంద్రం

ఇదేం మర్మమో..?

ఖమ్మం, వైరా కొనుగోలు కేంద్రాల్లో 8వేల బస్తాల చొప్పున పెసలు కొనాలని ప్రభుత్వం తొలుత నిర్ణయించింది. ఒక్కో కేంద్రానికి అదనంగా 2వేల బస్తాలు కొనుగోలు చేసేలా అనుమతివ్వాలని డీసీఎంఎస్ అధికారులు మార్క్‌ఫెడ్ అధికారులకు ప్రతిపాదనలు పంపించారు. అయితే ఒక్కో కేంద్రంలో అదనంగా 1,000 బస్తాలు మాత్రమే కొనేలా రాష్ట్రస్థాయి అధికారులు అనుమతించారు. దీనిని దళారులు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. రైతుల సరకును దాదాపు మొత్తం కొనేశామంటూనే అదనంగా ఖరీదు చేసేందుకు ఉన్నతాధికారులను నిర్వాహకులు అనుమతులు అడగటంపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

దళారుల ప్రమేయంపై విజిలెన్స్ నివేదిక

రైతుల సరకు మొత్తం కొనుగోలు చేయటం పూర్తయ్యిందని, ఇప్పుడొచ్చే పెసలంతా వ్యాపారులు, దళారులదేనంటూ విజిలెన్స్ కమిటీ రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించింది. వాస్తవానికి రైతులు తమ సరకును చాలావరకు విక్రయించారు. గతంలో రైతుల దగ్గర తక్కువ ధరకు కొన్న దళారులు ప్రభుత్వం నెలకొల్పిన పెసల కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించారు. ఈవిషయాన్ని విజిలెన్స్ కమిటీ గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారమివ్వటంతో దళారుల ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. ప్రస్తుతం ఒక్కో కొనుగోలు కేంద్రంలో 500 బస్తాల చొప్పున నిల్వలు పేరుకుపోయాయి.

చెల్లింపులు ఇలా..

పెసలు విక్రయించిన రైతులకు రూ.3.23 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటివరకు రూ.2.90 కోట్లను నిర్వాహకులు చెల్లించారు. మరో 587 మంది రైతులకు మిగతా సొమ్ము చెల్లించాల్సి ఉంది.

	కొన్న బస్తాలు (క్వింటాళ్లలో)	విక్రయించిన రైతులు
ఖమ్మం	8,645(4,322.50)	667
వైరా	8,742(4,371.00)	597

కొంతమంది రైతులకు సొమ్ము చెల్లించాల్సి ఉంది. వారందరికీ రెండు, మూడు రోజుల్లో చెల్లిస్తాం. రైతులకు సంబంధించిన సరకు మొత్తం కొనుగోలు చేశాం. కొంతమంది కర్షకుల సరకును ఆన్‌లైన్ పొందుపరచాల్సి ఉంది.

- సునీత, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్

ప్రభుత్వం ప్రత్యేకంగా పెసల కొనుగోలు కేంద్రాలు నెలకొల్పి రైతులకు న్యాయం చేసింది. రైతుల దగ్గర ఉన్న సరకును కొనటం దాదాపు పూర్తయ్యింది. పెసలు విక్రయించిన రైతులకు వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- కొత్వాల శ్రీనివాసరావు, డీసీఎంఎస్ అధ్యక్షుడు

కోర్టు ఆవరణలో బతుకమ్మ వేడుకలు

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా కొలిచే బతుకమ్మ వేడుకలు కోర్టులో నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు బతుకమ్మ పాటలు ఆలపించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.భానుమతి, ఎ.సుచరిత, పీపీలు పీవీడీ.లక్ష్మి, లావణ్య, విశ్వశాంతి, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బతుకమ్మ పాటకు నృత్యం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

కలెక్టరేట్‌లో ప్రజావాణి



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వేణుగోపాల్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: 'ప్రజావాణి'లో అందిన ఫిర్యాదులపై సత్వరం స్పందించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మాట్లాడారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

నాణ్యమైన వైద్యమందించాలి: పీఓ

భద్రాచలం: ఆదివాసీ గ్రామాల్లో నాణ్యమైన వైద్యమందించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశించారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల వైద్యాధికారులతో తన కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. గిరిజనులు తమ నివాస ప్రాంతం నుంచి అరగంటలో ఆసుపత్రికి చేరుకునేలా మౌలిక వసతులు కల్పించాలన్నారు. బైక్ అంబులెన్సుల ద్వారా మారుమూల ప్రాంతాల్లోనూ సేవలందించాలని సూచించారు. కొండరెడ్ల కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటుచేయాలని పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, సూపరింటెండెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రాంతీయాసుపత్రి వైద్యులపై ఆగ్రహం

భద్రాచలం ప్రాంతీయాసుపత్రి వైద్యుల తీరుపై ఐటీడీఏ పీఓ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాలను సోమవారం పరిశీలించారు. కొందరు సిబ్బంది సమయపాలన పాటించడం లేదని, మరికొందరు వైద్యులు అందుబాటులో ఉండడం లేదని గుర్తించారు. కొన్ని వైద్య పరీక్షలను బయటకు రాస్తున్నారని తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రైవేటు ప్రాక్టీసులు చేస్తున్న వైద్యులపైనా ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రి వైద్యులతో ఐటీడీఏ కార్యాలయంలో పీఓ ప్రత్యేకంగా సమావేశమై వైద్యసేవల్లో రాజీ తగదని హెచ్చరించినట్లు సమాచారం.

లాభాలపాలు

మధిర, న్యూస్‌టుడే: మోతుబరి రైతు కుటుంబమే అయినా కూలీల ఖర్చు పెరగటం, వ్యవసాయంలో ఒడిదొడుకులు రావటంతో డెయిరీ ఫామ్ వైపు మొగ్గుచూపారు. మూడేళ్లుగా మంచి లాభాలు గడిస్తున్నారు. 35 గేదెలు, 15 ఆవులతో రెండు వేర్వేరు షెడ్లు నిర్వహిస్తూ.. పాలను సొంతంగా విక్రయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు మధిర పురపాలిక పరిధిలోని మడుపల్లికి చెందిన పుచ్చకాయల వెంకటనారాయణ. డెయిరీ ఫామ్ ప్రస్థానంపై ఆయన మాటల్లోనే వివరాలు..


గేదెల ఫామ్‌లో వెంకటనారాయణ

పెట్టుబడి: ఆవులు, గేదెల కొనుగోలుకు రూ.50లక్షలు, రెండు షెడ్ల నిర్మాణానికి రూ.30లక్షలు వెచ్చించాను. పశువులకు మేత కొరత రాకుండా ముందుగానే చర్యలు చేపట్టాలి. మార్కెట్‌లో పాలకు డిమాండ్ ఉంది. వీటి ధర పెరగటమే కానీ ఏనాడూ తగ్గలేదు. అందువల్లే కష్టమైనా.. స్వచ్ఛమైన పాలను ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో డెయిరీ ఫామ్‌ను ఎంచుకున్నా. నిత్యం పర్యవేక్షిస్తుంటే ఇందులోనూ మంచి లాభాలు సాధించవచ్చు.

మూడేళ్ల క్రితం: 35 గేదెలు, 15 ఆవులతో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేశా. స్థానికంగా కూలీల కొరత వల్ల వీటి నిర్వహణ కోసం బిహార్ నుంచి పనివాళ్లను తీసుకొచ్చా. 35 గేదెల నుంచి రోజూ 160 లీటర్ల పాలు, 15ఆవుల నుంచి 60 లీటర్ల పాల దిగుబడి వస్తుంది. వీటిని ఉదయం, సాయంత్రం పూట మడుపల్లితోపాటు మధిర పురపాలికలోని కొన్ని ఇళ్లకు వెళ్లి విక్రయిస్తున్నా. లీటరు పాలు రూ.70కి అందిస్తున్నా.

పశుగ్రాసాలు..: సొంతంగా 18ఎకరాల మాగాణి ఉంది. దీంతోపాటు 20ఎకరాల మాగాణిలో వచ్చే వరిగడ్డిని కొనుగోలు చేస్తున్నా. సొంతంగా వచ్చిన వరిగడ్డి, కొన్న గడ్డిని వాములుగా మార్చి తడవకుండా టార్పాలిన్ పట్టాలు కప్పుతా. ఇందుకోసం రూ.25వేలు ఖర్చవుతుంది. పచ్చిమేత కోసం పదెకరాల్లో నేపియర్ గడ్డి పెంచుతున్నా. మరో పదెకరాల్లో పిల్లిపెసర సాగుచేస్తున్నా. ఇవి కాకుండా పదకొండెకరాల బత్తాయి తోటలో కొంతకాలం పచ్చిగడ్డి లభిస్తుంది. ఈ తోటలో ఆవుల డెయిరీ ఫామ్ ఏర్పాటు చేశాను.

ఐదేళ్ల పాటు నిర్వహిస్తే..: పశువుల ఎరువు సొంతంగా చేస్తున్న మాగాణి భూమికి, బత్తాయి తోటకు వినియోగిస్తా. దీనివల్ల మంచి దిగుబడులు సాధిస్తున్నాను. ఐదేళ్ల పాటు డెయిరీ ఫామ్‌ను తగిన జాగ్రత్తలతో నిర్వహిస్తే పెట్టుబడులు పూడుతాయి. ఫామ్ మిగులుతుంది.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు


పసుపు రంగులోకి మారుతున్న మొక్కజొన్న

మొక్కజొన్నలో ప్రస్తుతం అత్యవసర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కేవీకే ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కె.రవికుమార్ తెలిపారు. వర్షాలతో కొన్నిచోట్ల మొక్కజొన్న పసుపు రంగులోకి మారిందని, దీని నియంత్రణకు ఎకరాకు 30- 40 కిలోల యూరియాతో పాటు 20 కిలోల మ్యూరేటుఆఫ్ పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని సూచించారు. ఆకుమచ్చ, ఆకుమాడు తెగులు కొన్నిచోట్ల ఆశించిందని, వీటి నియంత్రణకు మ్యాంకోజెబ్ 2.50 గ్రా. లేదా ప్రొపికొనజెల్ ఒక మి.లీ.ను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. కత్తెర పురుగు నియంత్రణకు క్లోరాంట్రోనిలిప్రోల్ 0.4 మి.లీ. లేదా స్పైనోటోరం 0.5 మి.లీ.ను లీటరు నీటికి కలిపి చల్లాలని తెలిపారు. ఎదిగిన లార్వా నివారణకు విషపు ఎరను పెట్టుకోవాలన్నారు. వరి తవుడు కలిపి పదికిలోలు, బెల్లం రెండు కిలోలను 2-3 లీటర్ల నీటిలో కలిపి 24 గంటలు పులియనిచ్చి థయోడికార్బ్ 100 గ్రాములు కలిపి ఉండలుగా తయారుచేసి సాయంత్రం పూట మొక్కల సుడుల వద్ద వేసుకోవాలని సూచించారు.

వైరా, న్యూస్‌టుడే

రైతేరాజు

మిరపలో తామర పురుగుల నివారణ ఇలా..



ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: మిరప నారు నుంచి ఆఖరి కోత వరకు తామర పురుగులు ఆశించి రసాన్ని పీలుస్తాయి. వాతావరణం పొడిగా, బెట్టగా ఉన్నప్పుడు ఈ పురుగులు తమ సంతతిని త్వరగా వృద్ధి చేసుకుంటాయి. ఖమ్మం జిల్లా ఉద్యానాధికారి జి.నగేశ్ చెబుతున్న వివరాల ప్రకారం.. ఈ పురుగుల వల్ల 30-50 శాతం మేర పంటకు నష్టం వాటిల్లుతుంది. తల్లి, పిల్ల పురుగులు గోధుమ రంగులో ఉండి ఆకు అడుగు భాగాన గుంపులుగా చేరి రసాన్ని పీలుస్తాయి. కొన్నిసార్లు పూమొగ్గలు, పూలను ఆశిస్తాయి. సాధారణంగా లేత ఆకులు, కాండాలను ఆశిస్తాయి. దీని వల్ల ఆకులపై బొబ్బలు ఏర్పడి అంచులు పైకి ముడుచుకుపోతాయి. అందువల్ల దీనిని 'పైముడత' అంటారు. దీని ఉద్ధృతి అధికంగా ఉన్నప్పుడు లేత ఆకులు ఎదగక మొక్కలు గిడసబారతాయి. పూతరాలుతుంది. ఆకులు ఇటుక రంగులో కనిపిస్తాయి. ఈ పురుగులు ఆశించి రసాన్ని పీల్చటం వల్ల లేతకాయలపై చారలు ఏర్పడి గిడసబారతాయి. వీటి నివారణకు మిరప నారు నాటిన తర్వాత ఫిప్రోనిల్ గుళికలను 15, 45 రోజులకు ఎకరాకు 8 కిలోల చొప్పున సాళ్లలో ఎదబెట్టాలి. అవసరాన్ని బట్టి ఫిప్రోనిల్ 2మి.లీ. లేదా స్పైనిటోరమ్ 1మి.లీ. లేదా సైయాన్ ట్రానిలిప్రోల్ 1.2గ్రా. లేదా స్పైనోసాడ్ 0.25 మి.లీ. లేదా అసిటామెప్రిడ్ 0.2గ్రా/లీ లేదా థయోక్లోప్రిడ్ 0.6మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4గ్రా.లు లీటరు నీటికి కలిపి ఆకు కింది భాగం తడిచే విధంగా పిచికారి చేయాలి.

ప్రశ్న జవాబు

? పత్తిలో రసం పీల్చే పురుగు, తామర, గులాబీరంగు పురుగులు ఆకులు, కాయలను ఆశిస్తున్నాయి. నివారణ మార్గాలు తెలపండి.
- కె.నాగేందర్‌రావు, బుచ్చిరెడ్డిపాలెం

◆ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు పత్తిలో పచ్చదోమ, తామర పురుగులు ఆశించేందుకు అనుకూలం. నివారణకు పురుగుల ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పుడు 5 మి.లీ., 1500 పీపీఎం వేపనూనె పురుగుల ఉద్ధృతి ఎక్కువగా ఉన్నప్పుడు నివారణకు రెండు మి.లీ. ఫిప్రోనిల్ లేదా 0.2 గ్రాములు ఎసిటామిప్రిడ్ లేదా 0.3 గ్రాములు ఫ్లూనికామిడ్ లేదా 0.75 మి.లీ. సల్ఫాక్సాఫ్లోర్ మందును 5 మి.లీ. 1500 పీపీఎం వేపనూనెతోపాటు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు పత్తిలో గులాబీ రంగు పురుగు ఆశించేందుకు అనుకూలం. నివారణకు పొలం గట్ల మీద ఉన్న వయ్యారిభామ కలుపును తొలగించాలి. ఎకరాకు 8 నుంచి 10 లింగాకర్షక బుట్టలు అమర్చాలి.



? వరిపంటలో అగ్గితెగులు విపరీతంగా ఉంది. నివారణ మార్గాలను వివరించగలరు. - వాంకుడోతు వీరయ్య, గార్ల

◆ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో అగ్గితెగులు సోకేందుకు అనుకూలం. తెగులు గమనించినట్లయితే నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రొథైయోలిన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లేదా ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ మిశ్రమ మందును 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. –మధిర, న్యూస్‌టుడే



డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త మధిర పరిశోధన స్థానం

వాట్సప్ నెంబరు: 76750 50041

పోటీ ఏదైనా.. పతకాలే లక్ష్యం!

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే

అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న 'గూడెం' యువ క్రీడాకారిణులు

నిరంతర సాధనతో జాతీయ స్థాయిలో ప్రతిభకనబరుస్తున్నారు కొందరు క్రీడాకారిణులు. ఆసక్తి ఉన్న క్రీడాంశాల్లో రెండు, మూడేళ్లుగా మెలకువలు నేర్చుకుంటూ పతకాలు కైవసం చేసుకుంటున్నారు. ఆటు చదువులోనూ ముందంజలో నిలిచి శెభాష్ అనిపించుకుంటున్నారు. ఈ నెల 17 నుంచి మూడ్రోజుల పాటు గుంటూరులోని నాగార్జున విశ్వవిద్యాలయంలో జరగనున్న 35వ సౌత్‌జోన్ నేషనల్ పోటీలకు కొత్తగూడెం‌కు చెందిన యువ క్రీడాకారిణులు సిద్ధమవుతున్నారు. ఉదయం, సాయంత్రం ప్రకాశం మైదానంలో కోచ్ మల్లికార్జున్ పర్యవేక్షణలో సాధన చేస్తున్నారు.

రెండోసారి జాతీయస్థాయి పోటీలకు..

సీహెచ్ వేదశ్రీ, 10వ తరగతి, కొత్తగూడెం



వేదశ్రీ క్రీడల్లో విభిన్న ప్రతిభచూపుతున్నారు. ఆయుధాల క్రీడాంశాల్లో పట్టు సాధించి.. పోటీ ఏదైనా పతకాన్ని కైవసం చేసుకుంటున్నారు. 2021 అక్టోబరులో ఖమ్మంలో జరిగిన సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్-12 విభాగంలో 100 మీటర్ల పరుగులో తృతీయ స్థానంలో నిలిచారు. 2023 డిసెంబరులో హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో డిస్కస్ త్రోలో స్వర్ణం, 2022 డిసెంబరులో హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగిన తెలంగాణ సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి పోటీల్లో షాట్‌పుట్‌లో స్వర్ణం, 100 మీటర్ల పరుగులో రజతం గెలిచారు. గతేడాది డిసెంబరు 16 నుంచి 20వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూలో జరిగిన 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీల్లో డిస్కస్ త్రోలో అండర్-14 విభాగంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ ఏడాది ఆగస్టు 29 నుంచి 24 వరకు హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగిన పదో తెలంగాణ సౌత్‌జోన్ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో ట్రైథ్లాన్ గ్రూపులో స్వర్ణం, జావెలిన్ త్రోలో మరో స్వర్ణం నిలిచారు. గుంటూరులో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

డిస్కస్‌త్రోలో.. జాతీయ స్థాయిలో..

దుంపల మధుప్రియ, 9వ తరగతి, పోస్టాఫీస్ సెంటర్



రెండేళ్లకు పైగా డిస్కస్‌త్రో సాధన చేస్తున్న మధుప్రియ మరిన్ని జాతీయ పతకాలే లక్ష్యంగా సాధన సాగిస్తున్నారు. 2023 డిసెంబరులో యూపీలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో రాష్ట్ర తరఫున ప్రతిభకనబరిచారు. అదే నెలలో హనుమకొండలో జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్‌లో అండర్-14 విభాగంలో రన్నర్‌గా నిలిచారు. త్వరలో జరిగే జాతీయ పోటీలకు అర్హత సాధించి, స్వర్ణ పతకమే లక్ష్యంగా నైపుణ్యాలు మెరుగుపరచుకుంటున్నారు.

తొలి ప్రయత్నంలోనే రన్నర్‌గా నిలిచి..

బానోతు పల్లవి, ఇంటర్ ద్వితీయ సంవత్సరం, చిట్టిరామవరం



ఇంటర్ చదువుతున్న పల్లవి హ్యామర్ త్రో క్రీడాంశంలో పట్టు సాధించారు. 2023 అక్టోబరులో కరీంనగర్‌లో జరిగిన సౌత్ జోన్ జూనియర్ స్టేట్‌మీట్‌లో అండర్-18 విభాగంలో తొలి ప్రయత్నంలోనే ద్వితీయ స్థానంలో నిలిచారు. నిరుడు డిసెంబరులో జేఎన్ఎస్ హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో విజేతగా బహుమతు అందుకున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 6-9 వరకు బిహార్ రాష్ట్రం పాట్నాలో జరిగిన పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొన్నారు. త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పతకమే లక్ష్యంగా పట్టుదలతో సాధన చేస్తున్నారు.

ఆ రెండు క్రీడల్లో స్వర్ణాలే లక్ష్యంగా..

అల్లెపు వందన, డిగ్రీ ద్వితీయ సంవత్సరం, కొత్తగూడెం



వందన గత ఐదేళ్లుగా డిస్కస్ త్రో, షాట్‌పుట్ క్రీడాంశాల్లో రాణిస్తున్నారు. 2019 డిసెంబరులో పంజాబ్‌లోని సంగ్రూర్‌లో జరిగిన జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్‌లో, 2021 ఫిబ్రవరిలో కేరళలోని కాలికట్ వర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభచూపారు. 2022 ఆగస్టులో మెదక్‌లో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్‌లో షాట్‌పుట్ విజేతగా, డిస్కస్‌త్రోలో రన్నర్‌గా నిలిచారు. గతేడాది డిసెంబరు 18, 19 తేదీల్లో కాకతీయ వర్సిటీలో జరిగిన పోటీల్లో రెండు క్రీడాంశాల్లోనూ రన్నర్‌గా నిలిచారు. ఈ ఏడాది జూన్‌లో హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు స్వర్ణాలు దక్కించుకుని శెభాష్ అనిపించుకున్నారు.

ముత్తంగి రూపంలో రాములోరి దర్శనం



భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి రూపంలో దర్శనమిచ్చారు. ముత్యాలతో పొదిగిన వస్త్రాలంకృతుడైన రామయ్య తండ్రి చూడముచ్చటగా దర్శనమిచ్చారు. ఈ రూపంలో ఉన్న రామయ్యను దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు భక్తిశ్రద్ధలతో సుప్రభాతం పలికి ఆరాధించి నామార్చన చేశారు. క్షేత్ర విశిష్టతను వైదిక పెద్దలు ప్రవచించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించి కంకణ ధారణ గావించారు. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీత ధారణ కనుల పండువగా సాగింది. మాంగల్యధారణ, తలంబ్రాల వేడుక ఆధ్యాత్మికతను పెంచగా దర్బారు సేవలో ఆలపించిన కీర్తనలు తన్మయత్వాన్ని చాటాయి.

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	6,000	7,011	6,700
పాతపత్తి	7,200	7,450	7,400
పెసలు	4,000	7,250	6,625
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	10,000	19,800	16,900
ఎండుమిరప	9,000	16,500	15,700

అంతర్రాష్ట్ర దోపిడీ దొంగల అరెస్టు


వివరాలను వెల్లడిస్తున్న పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఇద్దరు అంతరాష్ట్ర దోపిడీ దొంగలను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి రూ.4లక్షలకు పైగా విలువైన 50 గ్రాముల బంగారు ఆభరణాలను రికవరీ చేశారు. పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సోమవారం అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రహదారిలో సీఐ కరుణాకర్, ఎస్సై యయాతిరాజు, సాయికిశోర్ రెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలం రామచంద్రాపురానికి చెందిన బచ్చు సతీశ్, ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ గ్రామానికి చెందిన ఆరెంపుల ధర్మరాజు పోలీసులను చూసి కంగారుపడి పారిపోయేందుకు యత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని విచారించగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

దోపిడీ సమయంలో హత్యకూ వెనకాడరు.. నిందితులిద్దరూ దోపిడీకి పాల్పడే సమయంలో అడ్డొచ్చిన వారిపై అతి కిరాతకంగా వ్యవహరించి చితకబాదడమే గాక హత్య చేసేందుకూ వెనుకాడరని డీఎస్పీ తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో వీరు 15 దోపిడీ కేసులతోపాటు, ఒకరిని హత్య చేసిన ఘటనలో వీరిద్దరు నిందితులు. ఏలూరు జిల్లా చాట్రాయిలో దోపిడీ సమయంలో అడ్డొచ్చిన ఒకరిని హత్య చేసిన ఘటనలో జైలుకు వెళ్లి బెయిల్‌పై బయటకు వచ్చారు. అయినా వీరు దోపిడీలను ఆపలేదు. పగలు రెక్కీ నిర్వహించి రాత్రి సమయంలో దొంగతనాలకు పాల్పడతారని డీఎస్పీ వివరించారు. ఈ ఏడాది సెప్టెంబరు 10న అర్ధరాత్రి అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం కాలనీలో రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న తుమ్మలపల్లి సత్యనారాయణపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచి అతని భార్య కళావతి మెడలోని 18గ్రాముల బంగారం గొలుసును లాక్కెళ్లారు. ఫిబ్రవరి 15 రాత్రి దమ్మపేట మండలం మందలపల్లిలో దాబా హోటల్‌లో నిద్రిస్తున్న వృద్ధురాలు మందలపు సత్తెమ్మపై దాడిచేసి ఆమె మెడలోని బంగారం నానుతాడును లాక్కెళ్లారు. అదే నెలలో విశ్రాంత ఉపాధ్యాయుడు అంజయ్య దమ్మపేట బ్యాంకు నుంచి రూ.40వేలు తీసుకెళుతుండటాన్ని గమనించి అతనిపై దాడిచేసి దోపిడీ చేశారు. వీరిపై అశ్వారావుపేట పోలీసు స్టేషన్‌లో ఒకటి, దమ్మపేటలో మూడు, ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో రెండు, వేంసూరులో రెండు, ఆంధ్రాలోని ఏలూరు జిల్లా చాట్రాయిలో మూడు, అవనిగడ్డ, రేపల్లె, విస్సన్నపేట, నూజివీడులో కేసులున్నాయి. నిందితులను కొత్తగూడెం కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం: పీఓ

భద్రాచలం, న్యూస్‌టుడే: దరఖాస్తులు అందించిన వారిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తామని ఐటీడీఏ పీఓ రాహుల్ స్పష్టం చేశారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బారులో వినతులు స్వీకరించి క్షేత్ర స్థాయిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గిరిజనులతో ముచ్చటించి ఆయా ప్రాంతాల్లో అమలవుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. ఆయా వినతులను పరిష్కారం కోసం సంబంధిత యూనిట్ అధికారులకు పంపారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, రైతు బంధు రావడంలేదని, ఎప్పటి నుంచో పట్టాలు ఉన్నా భూములు లేవని, పట్టా భూమిలో పేర్ల మార్పు వంటి అంశాలపై అర్జీలు రావడంతో వాటిపై ఆయా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఉపాధి పథకాల కల్పనతో పాటు ఆర్థిక సహకారం నిమిత్తం పదుల సంఖ్యలో వినతులు అందాయి. డీడీ మణెమ్మ, ఆర్సీఓ నాగార్జునరావు, ఈఈ తానాజీ, ఎస్డీసీ రవీంద్రనాథ్, ఏఓ రాంబాబు, మేనేజర్ ఆదినారాయణ, విభాగాల అధికారులు పాల్గొన్నారు.


సమస్యలు వింటున్న పీఓ రాహుల్

మణుగూరులో జీవీ మాల్ ప్రారంభం

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: జీవీ మాల్‌లో లభించే వస్త్రాలకు ప్రత్యేకత ఉంటుందని సినీనటి అనసూయ అన్నారు. మణుగూరులో జీవీ మాల్‌ను సోమవారం ప్రారంభించారు. అనంతరం నూతన దుస్తులను ఆమె పరిశీలించారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మణుగూరులో జీవీమాల్ షోరూంను ప్రారంభించటం హర్షణీయమన్నారు. షోరూం అధినేతలు గుర్రం ఉమా మహేశ్వరరావు, నరేన్ మాట్లాడుతూ అన్ని వర్గాల వారికి అందుబాటు ధరల్లో దుస్తులు లభిస్తాయని తెలిపారు. అనసూయను చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు.


జీవీ మాల్‌లో నూతన దుస్తులను పరిశీలిస్తున్న సినీనటి అనసూయ, చిత్రంలో నిర్వాహకులు, తదితరులు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల విజేత ఖమ్మం

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సంబరాల్లో భాగంగా ఈ నెల 5న ప్రారంభమైన రాష్ట్రస్థాయి అండర్-17 బాలుర ఫుట్‌బాల్ పోటీలు సోమవారం ముగిశాయి. పాఠశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరేశ్‌కుమార్ పర్యవేక్షణలో కొత్తగూడెం ప్రకాశం మైదానం, పాల్వంచ నవభారత్ మైదానంలో గత మూడు రోజులుగా పోటీలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. పది ఉమ్మడి జిల్లాల జట్లు మ్యాచ్‌లలో తలపడ్డాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరుసగా ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జట్లు నిలిచాయి. విజేత జట్లకు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ క్రీడల పరిశీలకుడు వడ్డెన్న ట్రోఫీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు ప్రేమ్‌కుమార్, ఖదీర్, మంగీలాల్, మదన్‌మోహన్, కృష్ణ, రాము, యుగంధర్, శ్రీనివాస్, సుందరమ్మ, సీతాదేవి, సుజాత పాల్గొన్నారు.


ట్రోఫీతో ఖమ్మం జట్టు

ఇద్దరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష

ఆళ్లేరు, న్యూస్‌టుడే: మారణాయుధాలతో పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారని ఆళ్లేరు ఎస్సై పి.రజనీకర్ సోమవారం తెలిపారు. భద్రాద్రి జిల్లాలోని కొత్త పాల్వంచకు చెందిన వనపాకుల రాంబాబు అలియాస్ ఆజాద్ అలియాస్ ఈశ్వర్(35), వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్ పట్టణానికి చెందిన పిట్టల శ్రీనివాస్ అలియాస్ రాము(38) తుపాకీ(పిస్టల్)తో ఇతరులను బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారు. 2011లో ఆళ్లేరు శివారులో పోలీసులు తనిఖీలు చేపట్టిన క్రమంలో పట్టుబడ్డారు. ఇద్దరి నుంచి రెండు పిస్టళ్లను స్వాధీనపరచుకొని కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించారు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సత్యనారాయణ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. కోర్టు కానిస్టేబుల్ డి.స్వామి కేసు ట్రయల్ నడిపించారు.

భార్యను గొడ్డలితో నరికిన భర్త

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం మండలం గొందిగూడెంలో సోమవారం కురసం సురేశ్ అనే వ్యక్తి తన భార్య సత్యవతిని(30) గొడ్డలితో నరికాడు. ఈ సందర్భంగా ఆమె చేతికి, కాలికి తీవ్రగాయాలు అయ్యాయి. విషయం తెలిసిన వెంకటాపురం గ్రామంలోని ఆమె తల్లిదండ్రులు వచ్చి 108 వాహనంలో భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అక్కడ ఆమె చికిత్స పొందుతోంది. భార్యపై అనుమానంతోనే సురేశ్ ఈ దురాగతానికి పాల్పడినట్లు సమాచారం. వారికి అయిదేళ్ల పాప ఉంది. సత్యవతి స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తోంది. సాయంత్రం సత్యవతి కుటుంబ సభ్యులు అశ్వాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గర్భిణి మృతికి కారకులైన వారిని శిక్షించాలని ధర్నా

భద్రాచలం, దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: కడుపులో బిడ్డతో వైద్యశాలకు వచ్చిన నిండు గర్భిణి ప్రాణం పోవడానికి కారణమైన వైద్యులను, సిబ్బందిని కఠినంగా శిక్షించాలని దుమ్ముగూడెం మండలం చింతగుప్ప గ్రామానికి చెందిన బాధితులు సోమవారం భద్రాచలంలో ఆందోళన చేశారు. వీరికి సీపీఎం‌తో పాటు దాని అనుబంధ సంఘాలు మద్దతుగా నిలిచాయి. వివరాలను పరిశీలిస్తే.. చింతగుప్పకు చెందిన ఉయికా సమ్మక్క(26) అనే గర్భిణి మూడో కాన్పు కోసం ఆదివారం ఉదయాన్నే దుమ్ముగూడెం పీహెచ్‌సీలో చేరగా వైద్యుడు అందుబాటులో లేకపోవడం, ఆమెను భద్రాచలం వైద్యశాలకు తరలించడంలో జాప్యం నేపథ్యంలో ఆమె కడుపులో బిడ్డతో సహా సమ్మక్క మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో దుమ్ముగూడెం పీహెచ్‌సీకి తీసుకెళ్లిన బంధువులు సోమవారం రాత్రి ధర్నా చేశారు. అక్కడి పోలీసుల జోక్యంతో సమ్మక్క మృతదేహాన్ని మళ్లీ భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం విభాగంలో ఉంచారు.

☆ సోమవారం ఉదయం బాధిత కుటుంబ సభ్యులు గ్రామస్థులు భద్రాచలం వైద్యశాల ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేపట్టారు. దుమ్ముగూడెంలో అందుబాటులో వైద్యులు ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, గర్భిణి ఆరోగ్య పరిస్థితి తెలిసినా వైద్య సేవలకు తరలించడంలో ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరించారని వారిపై చర్యలు తీసుకోవాలని నినదించారు. ఏరియా ఆసుపత్రికి చేర్చినా ప్రాణాలను కాపాడలేకపోయారని అన్నారు. సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, వంశీకృష్ణ, చంద్రయ్య, ఐద్వా నాయకులు సున్నం గంగ, మచ్చా రమ, సీతాలక్ష్మి నేతృత్వంలో ప్రధాన ద్వారం వద్ద ధర్నా చేయడంతో అటువైపు రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. సీఐ సంజీవరావు అక్కడకు చేరుకున్ని చర్చించారు. పరిస్థితి తెలుసుకున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అక్కడకు చేరుకుని న్యాయం జరిగేలా చూస్తానని భరోసా ఇచ్చారు. అనంతరం బాధితులతో కలిసి ఐటీడీఏకు వెళ్లి పీఓ రాహుల్‌కు వినతిపత్రం అందించారు. బాధ్యులపై చర్యలు చేపట్టాలన్నారు. మృతిరాలి భర్త కృష్ణకు, ఆ కుటుంబంలో మరొకరికి ఉద్యోగం ఇప్పించాలని విజ్ఞప్తి చేయగా పీఓ సానుకూలంగా స్పందించారు. సమ్మక్క మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంత్యక్రియలకు ఎమ్మెల్యే రూ. 10వేలు, దుమ్ముగూడెం ఆసుపత్రి తరపున రూ.20 వేలు అందించారు.


భద్రాచలం ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ఎదుట ధర్నా చేస్తున్న సమ్మక్క బంధువులు, సీపీఎం నాయకులు

☆ సమ్మక్క మృతిపై వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సోమవారం ఆరా తీశారు. డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సమగ్ర నివేదికను సమర్పించాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ వివరాలను తెలుసుకున్నామని, పోస్టుమార్టం నివేదికను పరిశీలించిన అనంతరం శాఖాపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

☆ **స్టాఫ్ నర్సుపై కేసు:** గర్భిణి మృతి ఘటన నేపథ్యంలో దుమ్ముగూడెం పీహెచ్‌సీ స్టాఫ్‌నర్సు పద్మజారాణిపై సోమవారం దుమ్ముగూడెం ఎస్సై వెంకటప్పయ్య కేసు నమోదు చేశారు. ఈమె నిర్లక్ష్యం కారణంగానే సమ్మక్క మృతి చెందినట్లు ఫిర్యాదు అందడంతో ఈ కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ తెలిపారు.

భద్రాచలం
• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట

పర్ణశాల పనులు పూర్తి చేయండి: కలెక్టర్


గిరిజనులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి.పాటిల్

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ప్రసాద్ పథకం కింద సుమారు రూ.5 కోట్లు వ్యయంతో పర్ణశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. పర్ణశాల, బొజ్జిగుప్ప, నారాయణరావుపేట, ఆరేస్‌పేట గ్రామాల్లో కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ సోమవారం పర్యటించారు. పర్ణశాల సీతవాగు, నారచీరల ప్రదేశాన్ని తిలకించారు. దేవస్థానం భూముల్లో భక్తులకు వసతిగా ... చెట్లను పెంచి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని ఆదేశించారు. శ్రీస్వామివారిని దర్శించుకున్నారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వచ్చేలా పంటలు పండించి జీవనోపాధి పొందాలని సూచించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీవో ఈదయ్య, గిర్దావర్ వెంకటేశ్వరరావు, ఎంపీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల ఏర్పాట్లు ఘనంగా ఉండాలి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు పీవీకాలనీలో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాల ఏర్పాట్లు ఘనంగా ఉండాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్ సూచించారు. భద్రాద్రి క్రీడా మైదానంలో ఈనెల 10న బతుకమ్మ, 12న జరిగే దసరా సంబరాల ఏర్పాట్లను జీఎం దుర్గం రామచందర్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రత్యేక అధికారి శ్యామ్‌సుందర్, వెంకటేశ్వర్లు, రమేశ్, శ్రీనివాస్, రాంగోపాల్, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.


మణుగూరు పట్టణం: పీవీకాలనీలో బతుకమ్మ సంబరాల ఏర్పాట్లను పరిశీలిస్తున్న జీఎం దుర్గం రామచందర్



అన్నపురెడ్డిపల్లిలో సందడిగా..

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: మండలంలో బతుకమ్మ సంబరాలు వైభవంగా సాగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని అమ్మవారి మండపాల వద్ద మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అన్నపురెడ్డిపల్లిలోని అంకమ్మతల్లి దేవాలయం వద్ద మహిళలకు ఆలయ కమిటీ సభ్యులు బహుమతులు అందజేశారు.

కలిసిమెలిసి.. సామాజిక భవనం నిర్మించి..

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

గ్రామస్థులు ఐకమత్యంతో ముందుకు కదిలి గ్రామాభివృద్ధికి అడుగులు వేశారు. ఆలోచన వచ్చిందే తడవుగా గ్రామంలో పెద్దలు, యువత ఓ సమావేశం ఏర్పాటు చేసుకుని ఓ చక్కటి అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దుమ్ముగూడెం మండలం కొత్తపల్లి గ్రామస్థులు తమ గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలన్న దృఢ నిశ్చయంతో సమష్టి విరాళాలతో సామాజిక భవనాన్ని నిర్మించుకుని స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.


సామాజిక భవనం వద్ద కొత్తపల్లి గ్రామస్థులు

రాజకీయాలకు అతీతంగా..

కొత్తపల్లి గిరిజన గ్రామానికి ఓ పక్క ఆంధ్రప్రదేశ్, మరోవైపు ఛత్తీస్‌గఢ్ సరిహద్దు రాష్ట్రాలు. గ్రామంలో విద్యావంతులు, విద్యార్థులు ఉద్యోగులు, గ్రామస్థులు చక్కటి స్నేహభావంతో మెలుగుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామ సమస్యలను పరిష్కరించుకుంటారు. పంచాయతీలో ఎలాంటి రాజకీయ వివాదాలకు తావులేకుండా గ్రామాభివృద్ధి కోసం గుండి వెంకటేశ్ అనే వ్యక్తిని సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలో సమస్యలు, సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలపై అందరూ సమష్టిగా చర్చించుకునేందుకు, వివిధ కార్యక్రమాలకు అనువుగా ఓ చక్కటి వేదిక రూపొందించుకోవాలన్న ఏకాభిప్రాయంతో ఓ సామాజిక భవనాన్ని నిర్మించుకోవాలని నిర్ణయించుకున్నారు.

✦ తమ ఆలోచనను రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్థల పరిశీలన చేశారు. పంచాయతీ కార్యాలయానికి సంబంధించిన ప్రభుత్వ స్థలంలో సామాజిక భవనం నిర్మాణానికి అధికారులు అనుమతులు మంజూరు చేశారు. గ్రామస్థులైన పాకాలపాటి శ్రీనివాసవర్మ రూ.1,00,116, ఎల్ఐసీ ఏజెంట్ కణుగుల హరిబాబు భద్రాచలం శాఖ తరఫున బీమాగ్రామ్ ప్రోత్సాహ నిధులు రూ.1,00,000, కుర్సం వెంకటేశ్వరరావు రూ.37,260, విశ్రాంత వీఆర్వో రేసు ఆదినారాయణ రూ.15వేలు విరాళాన్ని అందజేశారు. దీనికితోడు గ్రామస్థులు విరాళాలు అందజేశారు. ఇలా సమకూరిన సుమారు రూ.4 లక్షలతో చక్కటి హాలును నిర్మించారు. కుర్చీలు, టేబుళ్లు, ఫ్యాన్ల సదుపాయాలను సమకూర్చుకున్నారు. గ్రామస్థులందరినీ ఆహ్వానించి లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ సమావేశాలు, గ్రామ సమస్యలపై చర్చలు, వివిధ వేడుకలు ప్రస్తుతం ఈ భవనంలోనే సాగుతున్నాయి.

కలెక్టరేట్ ముట్టడికి పిలుపు

పినపాక, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణలో అలసత్వం నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఈనెల 9 చేపట్టిన కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా ప్రచార కార్యదర్శి పల్లెపోగు వెంకటేశ్వర్లు కోరారు. ఏడూళ్లబయ్యారం అడ్డరోడ్డులో సోమవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033

సమస్య: బోడాయికుంటలో వీధిదీపాలు ఏర్పాటు చేయలేదు. మహిళలు, యువతులు, చిన్నారులు బతుకమ్మ ఆటపాటలు చీకట్లోనే ఆడాల్సి వస్తోంది.
- కృష్ణ, బోడాయికుంట గ్రామం

సమాధానం: రెండు రోజుల్లో బోడాయికుంటలో వీధిదీపాలు ఏర్పాటు చేయిస్తాం.
- అనురాధ, పంచాయతీ కార్యదర్శి, బోడాయికుంట – ఆళ్లపల్లి, న్యూస్‌టుడే

అశ్వారావుపేట పంచాయతీలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట వాల్‌ఛాంబర్ సమీపంలో తాగునీటి పైపు లీకై కిలోమీటరు మేర నీరు ప్రవహిస్తూ వాహనాల రాకపోకలకూ ఇబ్బందిగా మారింది. ఇళ్లలోకి నల్లా నీళ్లు ఎక్కే పరిస్థితిలేదు. లీకేజీని అరికట్టాలి. - ఎ.సీతారాములు, అశ్వారావుపేట



✔ అక్కడ పైపులు వాహనాలు ఎక్కి పగిలిపోయాయి. వెంటనే లీకేజీని అరికడతాం.
- కె.శ్రీరామ్మూర్తి, అశ్వారావుపేట పంచాయతీ కార్యదర్శి – అశ్వారావుపేట, న్యూస్‌టుడే

మనోవేదనతో యువతి ఆత్మహత్య

పినపాక, న్యూస్‌టుడే: మనోవేదనతో పురుగుమందు తాగి యువతి బలవన్మరణం పొందిన ఘటన రాయిగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. ఏడూళ్లబయ్యారం ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయిగూడెంకు చెందిన సంకీర్తన(24) బీటెక్ పూర్తి చేశారు. ఉద్యోగావకాశాలు రాకపోవడంతో మనోవేదనకు గురై పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మణుగూరుకు, అనంతరం హైదరాబాద్ వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ సోమవారం ఆమె మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి.. పురుగు మందు తాగి..

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం మండలం గొందిగూడెంలో గొల్లపల్లి ప్రసాద్(37) సోమవారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం... ప్రసాద్ భార్యతో గొడవ పడ్డాడు. ఆమెపై దాడి చేశాడు. తర్వాత బయటకు వెళ్లి పురుగు మందు తాగాడు. రైలు కట్ట వద్ద పడిపోయాడు. కుటుంబ సభ్యులు అతన్ని మణుగూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతనికి నలుగురు పిల్లలు ఉన్నారు.

టిప్పర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుకు గాయాలు

భద్రాచలం, న్యూస్‌టుడే: దుమ్ముగూడెం మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన కణితి రామారావు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా భద్రాచలం అంబేడ్కర్ కూడలిలో టిప్పర్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన రామారావును ఏరియా ఆసుపత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

గంజాయి పట్టివేత

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం మండలం గొల్లగూడెం సమీపంలోని సీతారామ ప్రధాన కాలువ వంతెన వద్ద ఓ ఆటోలో తరలిస్తున్న 51 కిలోల గంజాయిని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఆటోను, డ్రైవర్ శివకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటో భద్రాచలం నుంచి పెద్దపల్లికి వెళ్తున్నట్లు గుర్తించారు. సీఐ జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. గంజాయి విలువ సుమారు రూ.12.75 లక్షలు ఉంటుందని సీఐ తెలిపారు.

ఆటో బోల్తా

అశ్వాపురం, న్యూస్‌టుడే: సత్యనారాణపురం వద్ద సోమవారం ఓ ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. అదృష్టవశాత్తు ఎవరికి ఏమీ కాలేదు. ఆటో భద్రాచలం నుంచి మణుగూరుకు వైపునకు వెళ్తుండగా అందులో ముగ్గురు ప్రయాణిస్తున్నారు.

ఇసుక లారీ స్వాధీనం

ములకలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వీకే రామవరం శివారు ముర్రేడు వాగు నుంచి ఇసుకను అక్రమంగా లారీలో తరలిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడుచేసి లారీని మాదారం శివారులో స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

ఉపాధ్యాయుడు మృతి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని చినార్లగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కొర్సా జోగారావు(51) తీవ్ర అనారోగ్యంతో సోమవారం ఉదయం మృతి చెందాడు. కొంతకాలంగా ఆయన కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం మరింత క్షీణించి మృతి చెందారు. ఆయన మృతి పట్ల ఎంఈవో సున్నం సమ్మయ్య, పలువురు ఉపాధ్యాయులు తీవ్ర సంతాపం తెలిపారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయండి

గుండాల, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు నర్సాపురంతండాలో నిర్వహించనున్న కబడ్డీ, క్యారమ్, క్రీడా పోటీలను విజయవంతం చేయాలని సంత్ సేవాలాల్ యూత్ అసోసియేషన్ నాయకులు నరేష్ అన్నారు. సోమవారం గుండాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువకుల్లో స్నేహభావం పెంచడానికి, ప్రతిభను వెలికి తీయడానికి పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

కరకగూడెం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన సర్వే పారదర్శకంగా నిర్వహించి, ప్రతి ఒక్కరికి రేషన్, ఆరోగ్యకార్డులతోపాటు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మాట్లాడుతూ... గతంలో ప్రజలు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే కొంతమందికే గ్యాస్ రాయితీ, ఉచిత విద్యుత్ పథకాలు అమలవుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మడివి ఉంగయ్య, కొమరం కాంతారావు, చర్ప సత్యం, కొవ్వాసీ వెంకటేష్, గంగయ్య, అడమయ్య తదితరులు పాల్గొన్నారు.


అశ్వాపురంపాడులో నినదిస్తున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల వినతి

అశ్వాపురం, న్యూస్‌టుడే: మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలోని మల్టీపర్పస్ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీఓ ముత్యాలరావుకు సోమవారం వినతిపత్రం సమర్పించారు. గ్రామ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గద్దల శివకృష్ణ, పల్లె రమేశ్, ఉపాధ్యక్షులు జలేందర్, చంద్రశేఖర్, నాయకులు లక్ష్మణ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను అరికట్టాలి'

చంద్రుగొండ, న్యూస్‌టుడే: ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలను అరికట్టాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఉమర్ డిమాండు చేశారు. చంద్రుగొండలో సోమవారం ఆ పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు భీముడు, వెంకటేశ్వర్లు, రసూల్, లాల్‌బీ తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు రూపొందించాలి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు ఏరియాలో బొగ్గు ఉత్పత్తికి నిర్దిష్టమైన ప్రణాళికలు రూపొందించాలని సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ సూచించారు. మణుగూరు ఏరియాలో సోమవారం పర్యటించిన డైరెక్టర్ ఓసీ 2, ఓసీ 4, మణుగూరు ఓసీ, వర్క్‌షాప్‌లను సందర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. ఓబీ వెలికితీత లక్ష్యాలను సాధించేందుకు పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. పని గంటలు పూర్తిగా సద్వినియోగం చేసుకొని, యాంత్రిక శక్తిని వినియోగించుకోవాలన్నారు. గనుల్లో నిలిచి నీటిని పంపేలా మోటార్లను కండీషన్లలో ఉంచాలన్నారు. హాల్ రహదారులను సరిచేయాలన్నారు. కార్యక్రమంలో జీఎం దుర్గం రామచందర్, శ్రీనివాసు, లక్ష్మీపతి గౌడ్, రాంబాబు, వీరభద్రుడు, మదన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


ఓసీ-2 బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణ

ముళ్లపొద కాదు.. గిరిజనుల వినూత్న ఆలోచన..!

చూడగానే ఇదేదో ముళ్లపొదలా అనిపిస్తోంది కదూ.. గిరిజనుల వినూత్న ఆలోచనకు రూపం ఇది.. అశ్వారావుపేట మండలం మొద్దులగూడెం సమీప గూడెం వద్ద తమ ఇళ్ల ముందు రోడ్డు ఆనుకుని కాలువ పక్కనే పూలమొక్కలు, కూరగాయల మొక్కలు నాటారు. బెండ, బీర, పసుపు, మందారం, సొరకాయ, కాకర, గోంగూర, బచ్చలి, పందిరి దోస, అరటి తదితర మొక్కలు వేశారు. దూరం నుంచి చూసేవారికి ఇదొక ముళ్లపొదలా కనిపిస్తోంది. దగ్గరకు వెళ్లి చూస్తే అన్ని కూరగాయల మొక్కలు, పాదులు, పూల మొక్కలు కనిపిస్తున్నాయి.
– అశ్వారావుపేట, న్యూస్‌టుడే



పురపాలకం ఏర్పాటుకు.. కదులుతున్న దస్త్రాలు..!

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: అశ్వారావుపేట పురపాలక సంఘగ ఏర్పాటు ప్రతిపాదనల దస్త్రాలు వేగంగా కదులుతున్నాయి. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాల చెరువు, అల్లిగూడెం, ఊట్లపల్లి, కేశప్పగూడెం, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓతో పలు అంశాలపై సోమవారం చర్చించారు. జనాభా, ఓటర్లు, వ్యవసాయ కుటుంబాలు ఎన్ని, వ్యవసాయ కూలీల కుటుంబాలు ఎన్ని, పంచాయతీ ఆదాయ వ్యయాలు, విస్తీర్ణం, కిలోమీటరకు ఉన్న జనాభా శాతం, పన్నులు, ఉపాధి కార్డులు, వ్యవసాయ భూమి, పంటలు, భౌతిక వనరులు తదితర అన్ని అంశాలపై సమీక్షించారు. నివేదికను కలెక్టర్‌కు పంపనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.


పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

దసరాను ఆనందంగా నిర్వహించుకోవాలి: ఎమ్మెల్యే

భద్రాచలం, న్యూస్‌టుడే: విజయదశమి ఉత్సవాలను ప్రతిఒక్కరు సంతోషంగా నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పేర్కొన్నారు. మహిళలకు సోమవారం భద్రాచలంలో చీరలను పంపిణీ చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక బస్టాండ్ రోడ్డు, ఆదర్శనగర్ కాలనీ, పాత కూరగాయల మార్కెట్‌లోని దసరా మండపాలను ఎమ్మెల్యే వెంకట్రావు-ప్రవీణ దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవార్లకు చీర, సారె సమర్పించారు.


ఆదర్శనగర్‌లోని మండపంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ముగిసిన శిక్షణ తరగతులు


ప్రత్యేక అధికారితో శిక్షణలో పాల్గొన్న మల్టీపర్పస్ వర్కర్లు

అశ్వాపురం, న్యూస్‌టుడే: గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో మండలంలోని గ్రామ పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లకు అశ్వాపురంలోని రైతు వేదికలో ఈనెల 3 నుంచి జరుగుతున్న శిక్షణ సోమవారం ముగిసింది. విద్యుత్తు మోటార్లు, పైపులైన్‌ల మరమ్మతులు, నీటి నాణ్యతా పరీక్షలు, తాగునీటి బోర్ల మరమ్మతులు, నిర్వహణ తదితరాలపై పంచాయతీల మల్టీపర్పస్ వర్కర్లకు మాస్టర్ ట్రైనర్ సురేందర్ శిక్షణ ఇచ్చారు. జిల్లా మత్స్య శాఖ అధికారి ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. ఇకపై ఎటువంటి ఆటంకం లేకుండా తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఏఈ పి.కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

లారీ యజమానుల సంఘం నూతన కమిటీ ఏర్పాటు

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు లారీ యజమానుల సంఘం నూతన కమిటీ సోమవారం ఏర్పాటైంది. కమిటీ సభ్యులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సమక్షంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మల్లేటి బాల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మేరెడ్డి సురేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా పెంట్యాల దశరథం, కోశాధికారిగా పిన్నపురెడ్డి జైపాల్‌రెడ్డిలతోపాటు మరికొంత మంది కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలిపారు.


నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే పాయం

జగజ్జనని.. విశ్వరూపిణి

మణుగూరు సాంస్కృతికం, బూర్గంపాడు, న్యూస్‌టుడే: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మణుగూరులోని పలు అమ్మవారి ఆలయాల్లో సోమవారం అమ్మవారు మహాచండీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా సివిల్ ఆఫీస్ కనకదుర్గ ఆలయం, శ్రీ పంచముఖ వేదగాయత్రి మాత ఆలయాల్లో అమ్మవారిని పారిజాత పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

✦ సారపాక వర్తక సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న దసరా మహోత్సవాల్లో సోమవారం అమ్మవారు మహాచండీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రకాల గాజులతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు.

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరంగాపురం శ్రీవిజయదుర్గా అమ్మవారి ఆలయంలోను, మామిళ్లవారిగూడెం, నారాయణపురం, వినాయకపురం, గాండ్లగూడెం, జమ్మిగూడెం, అనంతారం, తిరుమలకుంటలో అమ్మవారికి మహిళలు సామూహిక కుంకుమార్చనలు, లలితాపారాయణం చేశారు. మామిళ్లవారిగూడెంలో అన్నసమారాధన కార్యక్రమం సాగింది.

దమ్మపేట: స్థానిక గాయత్రీ ఆశ్రమంలో ప్రేమ్ సుస్థిరమూర్తీజీ ఆధ్వర్యంలో గాయత్రీహోమం నిర్వహించారు. అమ్మవారు మహాచండీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. నాచారం జయలింగేశ్వరస్వామి ఆలయం, దమ్మపేట శ్రీవిశ్వేశ్వరాలయం, వడ్లగూడెం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, నాగుపల్లి శివాలయాలం, గణేశ్‌పాడు శ్రీ విజయదుర్గా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.


పర్ణశాలలో బాలా త్రిపురసుందరీదేవిగా..


సారపాకలో మహాచండీ అలంకారంలో..


మణుగూరు కనకదుర్గ ఆలయంలో..


అశ్వారావుపేట గ్రామీణం: మామిళ్లవారిగూడెంలో మహాచండీదేవి అలంకరణలో దుర్గమ్మ

బాలా త్రిపురసుందరీదేవిగా జగన్మాత

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పర్ణశాల, నడికుడి ఆలయాల్లో అమ్మవారిని బాలత్రిపుర సుందరీదేవి అవతారంలో సోమవారం అలంకరించారు. విశేష పూజలు, కుంకుమార్చనలు, సహస్ర నామార్చన, ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

విచ్చలవిడిగా నాటుసారా విక్రయాలు

పినపాక, న్యూస్‌టుడే

పినపాక మండలంలో నాటుసారా(గుడుంబా), విప్పసారా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. దుగినేపల్లిలో తయారీ సైతం అధికంగా జరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. గుడుంబాకు బానిసలై రెండు సంవత్సరాల వ్యవధిలో ఇద్దరు వ్యక్తులు మృత్యువాత పడినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఏడూళ్లబయ్యారం, పోతురెడ్డిపల్లి, గోపాలరావుపేట గ్రామాల్లో సైతం విప్పసారా విక్రయాలు అధికమయ్యాయి. పలు ఆదివాసీ గ్రామాల నుంచి కొనుగోలు చేసిన పలువురు గ్రామాల్లో విక్రయాలు చేపడుతున్నారు. నాటుసారా ధర తక్కువగా ఉండడంతో యువత సైతం బానిసలవుతున్నారు. అధికారులు తూతూ మంత్రంగా దాడులు నిర్వహిస్తున్నారని పూర్తిగా నివారించే విషయంలో విఫలం అవుతున్నారని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. సిబ్బందితో ప్రతినిత్యం తయారీ కేంద్రాలతోపాటు విక్రయాలు జరుపుతున్న గ్రామాల్లో దాడులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ములుగు జిల్లా సరిహద్దు ప్రాంతమైన దుగినేపల్లిలో పలువురు ఇతర ప్రాంతాల నుంచి బెల్లం తీసుకువస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. ప్రత్యేక సిబ్బందితో నిఘా ఏర్పాటు చేసి నాటుసారాను కట్టడి చేస్తామన్నారు. తయారీ, విక్రయదారులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.


ఇటీవల ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటుసారా

వృథా జలాలతో.. సమృద్ధిగా పంటలు

అశ్వాపురం, న్యూస్‌టుడే

అమ్మగారిపల్లి శివారులోని పచ్చటి వరి పొలాలను చూస్తే ఎవర్నికైనా ఏ చెరువు లేదా కుంట కింద సాగవుతున్న వరి పొలాలనే అనుకుంటారు. కానీ వీటికి ఏ చెరువు, కుంట వంటి ఆదరవు లేదు. పక్కనే ప్రతిష్ఠాత్మక సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ ఉన్నా దానికి, వీటికి ఏ సంబంధం ఉండదు. ఇవి కేవలం భారజల ప్లాంటు వృథా జలాలతో సాగవుతున్న వరి పొలాలంటే ఒకింత ఆశ్చర్యమే కలుగుతుంది. గతంలో వేయి ఎకరాలు సాగయ్యేవి. సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ కింద రైతులు భూములు కోల్పోవాల్సి రావడంతో చివరకు 500 ఎకరాలకు పరిమితమైంది. భారజల ప్లాంట్‌లో భారజలం ఉత్పత్తి ప్రక్రియ అనంతరం ఈ వృథా జలాలను గోదావరిలోకి వదిలేస్తారు. అయితే రైతులు భారజల ప్లాంట్ యజమాన్యంతో మాట్లాడి ఆ జలాలను వాడుకునేందుకు అనుమతిని తీసుకున్నారు. చేయీచేయి కలిపి స్వచ్ఛందంగా కిలోమీటర్ల పొడవునా తమ పొలాలకు కాలువలు తవ్వుకున్నారు. ప్రస్తుతం ఆ జలాలతోనే తమ పొలాలను సాగు చేసుకుంటున్నారు. వారికి ఏ చెరువు, కుంట అవసరం లేదు. వర్షాలు కురిసినా ఒకటే కురవకున్నా ఒకటే. ఏడాదికి రెండు పంటల సిరులు వారి సొంతం. ఏఓ సాయిశంతన్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమ్మగారిపల్లి రైతులు ఈ విషయంలో ఎంతో ఆదర్శప్రాయులంటూ ప్రశంసించారు.


అమ్మగారిపల్లిలో వృథా జలాల కింద సాగవుతున్న వరి పొలాలు

రహదారుల గండ్లు పూడ్చివేత

ఈనాడు కథనానికి స్పందన

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: భారీ వర్షాలు, వరదలకు నారంవారిగూడెం- కొత్తనారంవారిగూడెం మధ్య వాగు వంతెన వద్ద రోడ్డు భారీగా కోతకు గురైంది. రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడిన అంశంపై సెప్టెంబరు 10న 'అనుసంధానం.. ఆగమాగం' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ రాజ్ డీఈఈ శ్రీధర్ సారథ్యంలో రూ.2లక్షల వరద సహాయక నిధులను ఖర్చు చేసి గండి పూడ్చారు. సమస్య పరిష్కారం కావడంతో ఆ ప్రాంత రైతులు, కొత్తనారంవారిగూడెం, మొద్దులగూడెం, నారంవారిగూడెం గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

అశ్వారావుపేట గ్రామీణం: నారంవారిగూడెం - గుర్రాలచెరువు దారిలో భారీ వర్షాలకు గండిపడి రోడ్డు ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో స్థానికులు అక్కడ రేకులను రక్షణగా ఉంచిన పరిస్థితిపై 'రేకులే రక్షణగా..!' శీర్షికన ఆదివారం ప్రచురితమైన కథనానికి స్పందించిన నారంవారిగూడెం పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు గండిని సోమవారం తాత్కాలికంగా మట్టితో పూడ్చించారు.


గండి పూడ్చిన అనంతరం నారంవారిగూడెం- కొత్తనారంవారిగూడెం రహదారి

కొత్తగూడెం

• కొత్తగూడెం • ఇల్లెందు

17న వరంగల్‌లో 'ఆర్టిజన్ కన్వర్షన్' మహాసభ


సమావేశంలో పాల్గొన్న జేఏసీ నాయకులు

పాల్వంచ, న్యూస్‌టుడే: విద్యుత్తు ఆర్టిజన్ల కన్వర్షన్‌పై వరంగల్‌లోని ఎన్పీడీసీఎల్ కార్యాలయం వద్ద మహాసభను ఈ నెల 17న నిర్వహిస్తున్నట్లు ఉద్యోగుల సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు వజీర్ తెలిపారు. పాల్వంచ కేటీపీఎస్ ఏ కాలనీలో ఆర్టిజన్లతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ కేటీపీఎస్‌లో జరగాల్సిన ఆర్టిజన్ల సభను రద్దు చేసినట్లు వెల్లడించారు. నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేటీపీ-3కి అనుమతులు ఇప్పించాలని వినతి

టేకులపల్లి, న్యూస్‌టుడే: ఇల్లెందు ఏరియాలో కోయగూడెం ఓసీ-3కి అనుమతులివ్వాలని, జేకే ఓసీ విస్తరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను ఎమ్మెల్యే కోరం కనకయ్య కోరారు. సింగరేణి లాభాల బోనస్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈమేరకు సోమవారం విజ్ఞప్తి చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) కొత్తగూడెం: 8008573723 పాల్వంచ: 9550076766 ఇల్లెందు: 9154846689

సమస్య: కొత్తగూడెం రైతుబజార్ సమీపంలో కిన్నెరసాని పైపులైన్ లీకేజీ కారణంగా విలువైన జలాలు వృథా అవుతున్నాయి. సీసీ రోడ్డు దెబ్బతింది. గుంతల వల్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. - స్థానికులు

సమాధానం: సత్వరం లీకేజీలను అరెస్టు చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. - శేషు, కమిషనర్
– కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే



✆ పాల్వంచ గాంధీనగర్ ఏరియా డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. – గోపి, స్థానికుడు
✔ ఏరియా జవాన్‌కు చెప్పి సమస్యను పరిష్కరిస్తాం. - కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి
– పాల్వంచ, న్యూస్‌టుడే

✆ మా ప్రాంతానికి మిషన్ భగీరథ తాగునీరు గత కొన్ని రోజులుగా సరఫరా కావడం లేదు. - ఓ పాఠకుడు, అశోక్‌నగర్
✔ ఇటీవల వరదలతో ముర్రేడు వాగులోని పైపులైన్ల జాయింట్లు దెబ్బతిన్నాయి. మరమ్మతులు వెంటనే పూర్తిచేయించి నీటిని సరఫరా చేస్తాం. - మల్లికార్జునరావు, ఏఈ, మిషన్ భగీరథ గ్రిడ్ – లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే

నిలిచిన బతుకమ్మ చీరల పంపిణీ


చీరలను ట్రాక్టర్లలో లోడ్ చేస్తున్న కూలీలు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకమ్మ చీరల పంపిణీపై సందిగ్ధం నెలకొంది. ఇల్లెందు నియోజకవర్గానికి 24 వేల చీరలను రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసింది. ఇల్లెందు రెవెన్యూశాఖ గోదాముకు చేరుకున్న చీరలను పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా గ్రామాలకు సోమవారం చేరవేశారు. అయితే చీరల పంపిణీని నిలిపివేయాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో పంపిణీ ప్రక్రియకు అడ్డుకట్ట పడినట్లు తెలుస్తోంది. ఈ అంశంపై ఇల్లెందు పౌరసరఫరాల డిప్యూటీ తహసీల్దారు గుర్రం ప్రభాకర్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ చీరల పంపిణీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని ఆదేశాలొచ్చాయన్నారు. ఉన్నతాధికారుల సూచనల ప్రకారం నడచుకుంటామని తెలిపారు.

హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం


సభ్యత్వం అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

జూలూరుపాడు, న్యూస్‌టుడే: ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని కిసాన్‌మోర్చా జాతీయ కార్యదర్శి, కేరళ రాష్ట్ర ఇన్‌ఛార్జి గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. జూలూరుపాడులో సోమవారం భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం 9 నెలల పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎరువులపై రాయితీ ఇస్తోందని, ధాన్యంకు మద్దతు ధర, పత్తికి క్వింటాకు రూ.7,500 చెల్లిస్తోందన్నారు. ఎండోమెంట్ జాయింట్ కమిషనర్ సుదర్శన్‌ప్రసాద్ తివారీ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి చిలుకూరి రమేశ్, భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్‌రాథోడ్, కోటేశ్వరరావు, మాదినేని సతీశ్, నున్నా రమేశ్ పాల్గొన్నారు.

ఉన్నదంత నిర్లక్ష్యమే..

పాల్వంచ, న్యూస్‌టుడే

పాల్వంచ పట్టణం పాతపాల్వంచ, పాలకొయ్యతండా, కరకవాగు, కొమ్ముగూడెం, కేటీపీఎస్ కాలనీలో, నవభారత్ ప్రాంతంలోని మొత్తం పది ప్రభుత్వ విద్యాలయాల్లో ఇటీవల దంత వైద్య శిబిరాలు నిర్వహించారు. 1 నుంచి 10వ తరగతి వరకు మొత్తం 1,040 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారు. వారిలో సగం మందికిపైగా వివిధ సమస్యలతో బాధపడుతున్నట్లు తేలింది.

నవ లిమిటెడ్ వారు హైదరాబాద్‌కు చెందిన రోహిణి ఫౌండేషన్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. హిమోగ్లోబిన్ శాతాన్ని నిర్ధారించడంతో పాటు క్విక్ వైటల్ సైన్స్, అల్ట్రాసోనిక్ స్కేలింగ్, ఫ్లోరైడ్ అప్లికేషన్ వంటి చికిత్సలు, మందులను నిర్వాహకులు ఉచితంగా అందజేశారు. దంత సంరక్షణపై మరింత అవగాహన అవసరమని వైద్యులు అభిప్రాయపడ్డారు. ఆహారం తీసుకున్న తర్వాత దంత ధావనం చేసే అలవాటు మంచిదని సూచించారు. ఈ కార్యక్రమాలను వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల్లో నిర్వహించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మొత్తం విద్యార్థులు: 1,040 మంది	అల్ట్రాసోనిక్ స్కేలింగ్ చికిత్స పొందిన వారు..: 287
హిమోగ్లోబిన్ లోపం బాధితులు: 250	
దంతాలు పుచ్చిన వారు: 226	



'చిరుతిళ్లు, ముఖ్యంగా జిగురుతో కూడిన తీపి పదార్థాలు తినే విద్యార్థుల దంతాలు ఎక్కువగా పుచ్చిపోయాయి. చాలామంది పంటి శుభ్రతను నిర్లక్ష్యం చేయడం వల్లే చికిత్స పొందాల్సిన అవసరం వచ్చింది' అని దంత వైద్య నిపుణురాలు డా.అలేఖ్య 'న్యూస్‌టుడే'తో పేర్కొన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సరైన అవగాహన కల్పిస్తేనే పళ్లు పటిష్ఠంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకుంటారని అభిప్రాయపడ్డారు.



☛ "తరచూ పంటి నొప్పితో బాధపడేదాన్ని. ఇటీవల శిబిరంలో వైద్యులు చికిత్స ఇవ్వడంతో పాటు దంతాల శుభ్రతపై విలువైన సూచనలిచ్చారు. వాటిని పాటిస్తున్నాను. ఇలాంటి కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తే బాగుంటుంది."
– రఫత్ కతున్, 9వ తరగతి, కేటీపీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల



☛ "పంటి నొప్పి, నోటి దుర్వాసన ఎందుకు వస్తాయి? దంతాలు ఎందుకు రంగుమారతాయో వైద్యులు వివరించారు. పలు సమస్యలు రాకుండా ఆహారం తిన్నాక పళ్లను శుభ్రం చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. ఈ సూచనలను తోటి స్నేహితులు, కుటుంబీకులకు కూడా తెలియజెప్పాను."
– ఆఫ్రా అమీన్, 9వ తరగతి, కొమ్ముగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల,



☛ "వైద్య శిబిరంలో వైద్యులు సూచించిన ప్రకారం రోజూ ఉదయం, సాయంత్రం పళ్లు శుభ్రం చేసుకుంటున్నా. వారు చెప్పిన జాగ్రత్తలన్నీ పాటిస్తే ఎలాంటి దంత సంబంధ సమస్యలు తలెత్తవు. విద్యార్థులందరికీ దంత సంరక్షణ ఎంతో ముఖ్యమని తెలుసుకున్నా. ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయి".
– అసద్, 6వ తరగతి, పాతపాల్వంచ

పది మంది జూదరుల అరెస్టు

సుజాతనగర్: మండలం పరిధిలోని కోమటిపల్లి గ్రామ శివారులోని జూద స్థావరంపై సోమవారం పోలీసులు దాడిచేసి పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.72 వేల నగదు, 9 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసినట్లు ఎస్సై జుబేదా తెలిపారు.

పశువుల పట్టివేత.. కేసు నమోదు

టేకులపల్లి: హైదరాబాద్‌కు ఓ వాహనంలో పశువులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్సై పోగుల సురేశ్ కథనం మేరకు.. హైదరాబాద్‌కు చెందిన మోహిన్ కోసం మొరంపల్లి బంజరకు చెందిన మహ్మద్ వాజిద్ అనే వ్యక్తి 14 తెల్లజాతి పశువులను హైదరాబాద్‌లోని కబేళాకు తరలిస్తుండగా. టేకులపల్లి రాణా వద్ద పోలీసులు పట్టుకున్నారు. పశువులను పాల్వంచ గోశాలకు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఏరియా వర్క్‌షాప్‌లో అన్నదానం

కొత్తగూడెం సింగరేణి: కొత్తగూడెం ఏరియా వర్క్‌షాప్‌లో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా జీఎం షాలేమురాజు, వర్క్‌షాపు విభాగాధిపతి శ్రీకాంత్, ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి, ఐఎన్‌టీయూసీ నాయకుడు రజాక్, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస సదుపాయాలేవీ?

పేరుకే ప్రథమశ్రేణి పురపాలకం.. కానీ నీటి సరఫరా విభాగంలో పనిచేసే 'గూడెం' కార్మికుల కష్టాలు చెప్పనలవికాదు. 36 వార్డులకు నీటి సరఫరా చేసేందుకు ఎనిమిది వరకు జలభాండాగారాలున్నాయి. వాటి వద్ద విధులు నిర్వర్తించే కార్మికులకు కనీసం కూర్చునేందుకు సదుపాయాలు కరవయ్యాయి. రికార్డులు, ఇతర సామగ్రిని భద్రపరుచుకునేందుకు కనీసం టేబుల్ వంటివి సమకూర్చకపోవడం లేకపోవడం బాధాకరం. రైటర్‌బస్తీ రైతుబజార్ వద్దనున్న ప్రధాన వాటర్ ట్యాంకు వద్ద కార్మికులు విరిగిపోయి.. చిలుముపట్టిన ఇనుప టేబుల్‌తోనే కాలాన్ని నెట్టుకొస్తున్నారు. పురపాలక కౌన్సిల్‌లో చర్చించి కార్మికులకు కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేస్తామని కమిషనర్ శేషు పేర్కొన్నారు. – కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే


కార్మికులు కూర్చునేందుకు అందుబాటులో ఉన్న కుర్చీ ఇదే..


రికార్డులు నిర్వహించుకునే బల్ల దుస్థితిదీ..

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో బతుకమ్మ వేడుకలను మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నారు. మంగళవారం కొత్తగూడెం కార్పొరేట్ ప్రధాన కార్యాలయం పరిధిలో ప్రకాశం మైదానంలో సంబరాలు జరుపుకొంటారు. కొత్తగూడెం ఏరియాలో వేడుకలను ప్రగతివనంలో బుధవారం నిర్వహిస్తారు. డైరెక్టర్ వెంకటేశ్వర రెడ్డి, డి.సత్యనారాయణరావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఏరియాలో వేడుక ఏర్పాట్లను ఎస్వోటూ జీఎం కోటిరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం సివిల్ రామకృష్ణ, ఏరియా వర్క్‌షాప్ ఇంజినీర్ అనిల్, డీజీఎం శివకేశవరావు పాల్గొన్నారు.

వానరాల చేష్టలకు ఇక చెల్లు..

పాల్వంచ మండలంతో పాటు పట్టణంలోనూ దుకాణదారులకు వానరాల బెడద తప్పడం లేదు. వాటి నుంచి రక్షణగా దుకాణదారులు ఇలా వలలు ఏర్పాటు చేసుకున్నారు. ఇలాంటి జాగ్రత్తలు ఏర్పాటు చేసుకున్న పాల్వంచ పట్టణం జాతీయ రహదారి పక్కనున్న ఈ దుకాణాన్ని వాహనదారులు, పాదచారులు ఆసక్తిగా చూస్తున్నారు.
– పాల్వంచ, న్యూస్‌టుడే



సురక్షిత తాగునీటిని అందించాలి: ఈఈ

జూలూరుపాడు, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు సురక్షిత తాగునీటిని అందించడంలో మల్టీపర్పస్ వర్కర్లు ప్రధాన భూమిక పోషించాలని ఈఈ తిరుమలేశ్ అన్నారు. జూలూరుపాడు మండల పరిషత్ కార్యాలయంలో నాలుగు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలతో తాగునీటి సరఫరాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. మిషన్ భగీరథ డీఈ శివయ్య, గ్రిడ్ డీఈ హరి, ఎంపీవో తులసీరాం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.25,116 విరాళం



సత్తుపల్లి, న్యూస్‌టుడే: స్థానిక ద్వారకాపురికాలనీ-7 వీధిలో నూతనంగా నిర్మిస్తున్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవాలయానికి కొత్తగూడెం పట్టణానికి చెందిన గుగులోతు భీముడు, సుజాత దంపతులు సోమవారం రూ.25,116 విరాళం అందజేశారు. ఆలయ నిర్మాణ బాధ్యుడు ద్రోణంరాజు మల్లికార్జునశర్మ, ట్రస్ట్ ఛైర్మన్ సోమిశెట్టి శ్రీధర్‌లకు ఈ మొత్తం అందజేశారు. శాశ్వత ఛైర్మన్ రాగాల చంద్రారెడ్డి, గాదె నాగు, కోశాధికారి రాగాల రమేశ్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

'మనుధర్మానికి వ్యతిరేకంగా పోరాడండి'

టేకులపల్లి, న్యూస్‌టుడే: మతోన్మాదం ముసుగులో మనుధర్మాన్ని తిరిగి తీసుకురావటానికి కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని, మహిళలు ఐక్యమై మనుధర్మానికి వ్యతిరేకంగా పోరాడాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కల్తీ కోటమ్మ, సుభద్ర కోరారు. టేకులపల్లిలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, వేధింపులను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. పూసం రుక్కమ్మ, అరుణ, రాజేశ్వరి, ఈశ్వరి, లత, రాణి, కృష్ణవేణి, డి.ప్రసాద్, వెంకటేశ్వర్లు, నరసింహారావు, రాంచందర్ పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనంలో జ్ఞాపకాల దొంతరలు!



చుంచుపల్లి, న్యూస్‌టుడే: పెనగడప ఉన్నత పాఠశాల 2009-2010 బ్యాచ్ పదోతరగతికి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు చలపతిరాజు, విజయలక్ష్మి, మహేశ్వరి, శాంతకుమారిని సన్మానించారు. పూర్వ విద్యార్థులు నారాయణరావు, శివ, శ్రీను, మహేశ్, ప్రవీణ్, శ్వేత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

విలీన సభ విజయవంతానికి పిలుపు

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: సంఘటిత, అసంఘటిత రంగాల్లో 14 రాష్ట్రాల్లో పనిచేస్తున్న టీయూసీఐలో ఇఫ్టూ హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అక్టోబరు 20న విలీనమవుతుందని మాస్‌లైన్ డివిజన్ నాయకులు అజ్మీర బిచ్చా, కాంపాటి వెంకన్న తెలిపారు. ఇఫ్టూ విలీన సభ గోడపత్రికలను కొమరారంలో సోమవారం ఆవిష్కరించారు. విలీన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాఘవులు, మూతక్క, పాషా, శంకర్, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి కుటుంబానికి నిత్యావసరాల వితరణ

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: పక్షవాతంతో బాధితురాలైన మైలారం పంచాయతీకి చెందిన వృద్ధురాలు మల్లికాంబ కుటుంబానికి కొల్లి ఫౌండేషన్ నిర్వాహకులు కల్పనా చౌదరి సోమవారం నెలకు సరిపడా నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ రూప్లా నాయక్, వాలంటీర్లు జలీల్ పాషా, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మంగళగౌరీగా పెద్దమ్మ దర్శనం


పాల్వంచ: మైసమ్మతల్లి ఆలయంలో డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతుల పూజలు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు పాల్వంచ పెద్దమ్మతల్లి దేవాలయంలో అమ్మవారు మంగళగౌరీగా సోమవారం దర్శనమిచ్చారు. రుద్రాభిషేకం, రుద్రహోమంతో పాటు చండీహోమం, లక్ష కుంకుమార్చనను అర్చకులు వైభవంగా జరిపించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కొత్తగూడెం డివిజన్ పరిశీలకులు పి.బేల్‌సింగ్, ఈవో ఎన్.రజినికుమారి, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

★ పెద్దమ్మతల్లి ఆలయం ఆవరణలోని 1, 4 వాణిజ్య సముదాయాలను దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకులు పి.బేల్‌సింగ్ సోమవారం పరిశీలించారు. పాటదారులు దేవస్థానానికి అద్దె బకాయి చెల్లించాల్సి ఉండటంతో దుకాణాల్లోని వస్తువులను రికార్డు చేసి స్వాధీనం చేసుకున్నారు. ఆయనతో పాటు రూరల్ ఆర్.ఐ. హచ్యా, పోలీసు సిబ్బంది ఉన్నారు.

దుర్గమ్మకు విశేష పూజలు: పాల్వంచ, న్యూస్‌టుడే: పట్టణంలోని పలు మండపాల్లో దుర్గాదేవికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. గట్టాయిగూడెం ఆదర్శనగర్‌లో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో హోమం జరిపించారు. పాతపాల్వంచ మైసమ్మతల్లి ఆలయంలో జరిపిన పూజల్లో డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు దంపతులు పాల్గొన్నారు.

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడులో దుర్గమ్మతల్లిని చండీదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు. పాపకొల్లులో చండీయాగంలో దంపతులు పాల్గొన్నారు. గుండెపూడి, వెంగన్నపాలెం, కాకర్ల, రామచంద్రాపురం గ్రామాల్లో భక్తులు అమ్మవారిని సందర్శించి దీవెనలు అందుకున్నారు.

☛ జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. బతుకమ్మలను పేర్చి ఆసుపత్రి ఆవరణలో ఆడిపాడారు. జూలూరుపాడు రామాలయం, వెంగన్నపాలెం టీచర్స్‌కాలనీ, సాయిబాబా మందిరంలో మహిళలు, పిల్లలు బతుకమ్మలతో సందడి చేశారు. కాకర్ల, పడమటినర్సాపురం, బేతాళపాడు, పాపకొల్లు, వినోభానగర్‌లో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు.


పాల్వంచ: గట్టాయిగూడెం ఆదర్శనగర్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


టేకులపల్లి: బతుకమ్మ వేడుకల్లో మహిళలు


పాల్వంచ పట్టణం: మంగళగౌరీగా పెద్దమ్మ


జూలూరుపాడు: మహా చండీదేవి అలంకరణ

టేకులపల్లి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు మహాచండి అవతారంలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. టేకులపల్లి బ్రహ్మంగారి వీధిలో నిర్వహించిన అన్నదానాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మి ప్రారంభించారు.

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: బతుకమ్మ పండగ తెలంగాణ ఆడబిడ్డలకు ప్రత్యేకమైందని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఇల్లెందులోని తన కార్యాలయంలో బతుకమ్మ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఏజీఎం గిరిధర్‌రావు, సేఫ్టీ ఆఫీసర్ రామస్వామి, ఇంజినీర్ నరసింహరాజు, డీజీఎం పర్సనల్ మోహన్‌రావు, డీజీఎం సర్వే బాలాజీనాయుడు, అధికారులు ధనుంజయరెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ కేసులో.. నలుగురి రిమాండ్

పాల్వంచ గ్రామీణం, న్యూస్‌టుడే: రాగి తీగలు చోరీ చేసిన నిందితులను పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. కేటీపీఎస్‌లో స్విచ్‌యార్డు పక్కన ఉన్న స్టోర్‌లోని 30 కిలోల రాగి తీగలను గత ఆగస్టు 16న పాల్వంచకు చెందిన నాగరాజు, మహేశ్, వంశీ, అభిలాశ్‌లు చోరీ చేశారు. స్టోర్ ఇన్‌ఛార్జి ఫిర్యాదుతో ఈ ఘటనపై ఎస్సై కేసు నమోదు చేశారు. నిందితులు సోమవారం సాయంత్రం 10 కిలోల తీగను విక్రయించేందుకు వెళ్తుండగా పోలీసులు గమనించి పట్టుకున్నారు. తీగ ఎక్కడిదని అడగ్గా పొంతన లేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకొన్నారు. దొంగతనం చేసినట్లు విచారణలో అంగీకరించడంతో నలుగురిని రిమాండ్‌కు తరలించారు.

వాహనదారులు నిబంధనలు ఉల్లంఘించొద్దు: డీఎస్పీ


కొత్తగూడెం నేరవిభాగం: వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్, పక్కన ట్రాఫిక్ ఎస్సై నరేశ్

కొత్తగూడెం నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర మీదుగా గంజాయి రవాణా జరుగుతోందని, దొంగతనాలకు పాల్పడిన నేరస్థులు నంబరు ప్లేట్లు లేని వాహనాలపై తప్పించుకు పోతున్నారని డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహ్మాన్ అన్నారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ఎస్పీ బి.రోహిత్‌రాజు ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్సై నరేశ్ నేతృత్వంలో గత నాలుగు రోజులుగా ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు చెప్పారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని, శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న 1,200 వాహనాలను గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. ద్విచక్రవాహనదారులు అన్ని పత్రాలు కలిగిఉండాలని, శిరస్త్రాణం విధిగా ధరించాలన్నారు. మఫ్టీలో తనిఖీలు చేపట్టిన ఎస్సై బృందాన్ని అభినందించారు.

ఇల్లెందు గ్రామీణం: ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలని డీఎస్పీ చంద్రభాను తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలతో పాటు మత్తు పదార్థాల అనర్థాలపై ఇల్లెందులోని గోవింద్ ప్రాంతంలో ద్విచక్రవాహనదారులకు సోమవారం అవగాహన కల్పించారు. నంబర్ ప్లేట్లు లేని ద్విచక్రవాహనాలను స్వాధీనపరచుకున్నారు. సీఐ బత్తుల సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి: ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించాలని సీఐ తాటిపాముల సురేశ్ అన్నారు. టేకులపల్లి రాణా వద్ద ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్సై పోగుల సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.


టేకులపల్లి: వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ సురేశ్, చిత్రంలో ఎస్సై సురేశ్

కాలువల్లో చెత్తాచెదారం.. పాదబాట ఆక్రమణల పరం

కొత్తగూడెం పట్టణంలోని చిన్నబజార్ పలు వ్యాపారాలకు నిలయం. ఇక్కడి ఇరుకు రోడ్లకు తోడు డ్రైనేజీలు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి యథేచ్ఛగా వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. దుకాణాల్లో వెలువడే చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ కవర్లను, పాడైపోయిన పూలను అడ్డగోలుగా కాలువల్లో పారబోస్తున్నారు. అవన్నీ పేరుకుపోయి మురుగు స్తంభిస్తోంది. ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఆక్రమణల కారణంగా రద్దీ వేళల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. కొందరు ఇళ్లల్లోని మురుగును రోడ్డుపైకి వదిలేస్తుండటంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. గణేష్ టెంపుల్ కాంప్లెక్స్ నుంచి త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ రోడ్డు వరకు చిరువ్యాపారుల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం పండుగల సీజన్ కావడంతో పట్టణంలో రద్దీ మరింత పెరిగింది. ఆక్రమణలపై చర్యలు చేపట్టాలని, చిరువ్యాపారులతో ట్రాఫిక్ ఇబ్బదుల్లేకుండా చూడాలని పురవాసులు ట్రాఫిక్ పోలీసులను వేడుకుంటున్నారు.
- కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే


డ్రైనేజీలో పూలు, చెత్తచెదారం పడేశారిలా..


ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు..

పాలస్తీనాపై దాడులను నిరసిస్తూ ఆందోళన

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: అగ్రరాజ్యం అమెరికా అండతోనే ఇజ్రాయెల్ పాలస్తీనాపై దాడులు జరుపుతోందని సీపీఐ, సీపీఎం, సీపీఐ ఎంఎల్ పార్టీల నాయకులు ఆరోపించారు. పాలస్తీనాపై దాడులను నిరసిస్తూ వామపక్ష పార్టీలు మూడో పట్టణ కూడలిలో సోమవారం ఆందోళన నిర్వహించాయి. అంతకు ముందు శేషగిరిభవన్ నుంచి ప్రదర్శనగా కూడలికి చేరుకొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు ఏజే రమేష్, బానోతు ఊక్లా, గోపాలరావు, గౌని నాగేశ్వరరావు, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, అన్నవరపు సత్యనారాయణ పాల్గొన్నారు.


ఆందోళనలో నినాదాలు చేస్తున్న సాబీర్‌పాషా, నాయకులు